క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.అర్చకుడు రఘునాథ్ తదితరులు ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా విద్యాగణపతి ఆలయ వార్షికోత్సవం



అన్నసమారాధన ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: కృష్ణరాయపురంలోని విద్యా గణపతి ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. గణపతికి ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధనను కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రారంభించారు. దాదాపు 3 వేల మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నమో శివరుద్రాయ



ఉమాచంద్రమౌళీశ్వరుడు

సింహాచలం: అడవివరం దరి విజినిగిరి పాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో స్వామికి సోమవారం విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

19 నుంచి రామచంద్రమ్మ ఉత్సవాలు



రామచంద్రమ్మ అమ్మవారు

పరవాడ: వాడచీపురుపల్లి వాసుల ఆరాధ్య దేవత శ్రీ రామచంద్రమ్మ మహోత్సవాలను ఈ నెల 19 నుంచి 27 వరకు ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు పూర్తి చేశామని ఉత్సవ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. 19న శ్రీ రామచంద్రమ్మ అమ్మవారి పుట్టుక సంబరాలు నిర్వహిస్తారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారి సతకం పట్టున కోలాటాలు, చిడతలు, డ్యాన్సులు, వాలకాలతో అమ్మవారిని గ్రామంలో ఊరేగింపు ఉంటుంది. ఈ నెల 27న అనుపోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. అమ్మవారి అనుపును పురస్కరించుకొని గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలను నిర్వహిస్తారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అనకాపల్లి, విశాఖ పరిసర గ్రామాల నుంచి అత్యధిక భక్తులు తరలివస్తారని ఆలయ పూజారి కూండ్రపు అప్పలనాయుడు తెలిపారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



తాడి రైల్వే పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

పరవాడ: తాడి రైల్వే స్టేషన్ పరిధిలో రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహాన్ని రైల్వే పోలీసులు సోమవారం కనుగొన్నారు. మృతుడి వయసు 25 నుంచి 30 ఏళ్లుఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుడి ఒంటిపై సిమెంట్ కలర్ టీ షర్టు, బ్లాక్ కలర్ ఫుల్ ట్రాక్, డ్రాయర్ ఉంది. ఎడమ కాలికి నల్లని దారం, ఎడమ చేతికి సిల్వర్ కలర్ ఉంగరం ఉంది. ఎత్తు 5.7 అంగుళాలు, తెలుపు రంగు, మాసిన గెడ్డం కలిగి ఉన్నాయని దువ్వాడ జీఆర్‌పీ పోలీసులు చెప్పారు. వివరాలు తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని కోరారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన

- ఎన్నికల హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే
- బీఆర్‌టీఎస్ బాధితులకు అన్ని విధాలా న్యాయం
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- 98వవార్డులో రూ.1.15 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ప్రియాగార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి



ప్రియాగార్డెన్స్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ముత్తంశెట్టి

సింహాచలం: ప్రజా సంక్షేమం,రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 98వ వార్డు అడవివరంలో సోమవారం కోటి 15లక్షల 23వేల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శంకుస్థాపన చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రియాగార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో ముత్తంశెట్టి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల కోట్ల రూపాయలు సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు ఖర్చు చేశారన్నారు. దేశవ్యాప్తంగా ఏ ముఖ్యమంత్రికీ చెందని ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

ప్రజల చెంతకే పాలన

సచివాలయం, వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చి ప్రజల చెంతకే పాలన తీసుకువచ్చారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకం అందేలా చేశారన్నారు. రాజకీయాలకు అతీతంగా, లంచాలకు తావులేకండా కులాలు..మతాలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలం అందించారన్నారు. టీడీపీ పాలనలో ఆ పార్టీ అనుకూల వ్యక్తులకు, ఆ పార్టీ నాయకులు సూచించిన వారికే సంక్షేమ పథకాలు అందించిన పరిస్థితిని గమనించాలని కోరారు. నాడు పింఛన్ కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ వృద్ధులు తిరిగే పరిస్థితిని కళ్లారా చూశామన్నారు. కానీ జగన్‌మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత వలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఇంటికే పింఛన్ అందిస్తున్నపరిస్థితిని చూస్తున్నామన్నారు.

అక్కచెల్లమ్మలకు అండగా

డ్వాక్రా మహిళలకు రుణాలు, వడ్డీ మాఫీ చేస్తానని చంద్రబాబు మోసం చేశారన్నారు. కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రుణాలు మాఫీ చేసి అక్కచెల్లమ్మలకు అండగా నిలిచారన్నారు. గతంలో ఏమైనా సమస్య ఉంటే కార్యాలయాలు, అధికారులు, నాయకుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. నేడు సచివాలయం, వలంటీర్ ద్వారా ప్రజలు సమస్యలు తీరుస్తున్నారన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు మరింతగా వస్తాయని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బాధితులకు అండగా ఉన్నాం


అడవివరం బీఆర్‌టీఎస్ బాధితులకు అన్ని విధాలా న్యాయం చేస్తున్నామన్నారు. బాధితులకు అండగా నిలిచామన్నారు. 1:4 రేషియాలో టీడీఆర్‌లు అందిచామన్నారు. టీడీఆర్‌ల వేల్యూ సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు ముత్తంశెట్టి చెప్పారు. నష్టపరిహారం చెల్లించామని, దేవదాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి మిగిలిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునే పర్మిషన్ కూడా ఇప్పించడం జరిగిందన్నారు. పూర్తిగా ఇళ్లు కోల్పోయిన వారికి జగనన్న కాలనీల్లో 50 గజాల స్థలం ఇచ్చేందుకు ప్రణాళిక చేసినట్టు వెల్లడించారు.

కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-8 కమిషనర్ హేమవతి, 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, 98వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, 98వవార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, అడవివరం కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, ప్రియాగార్డెన్స్ అధ్యక్షుడు తొమురోతు రాము, సింహగిరి పునరావాసుల కాలనీ అధ్యక్షుడు ముగ్గ కిరణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు నడింపల్లి రామరాజు, కర్రి సత్తిబాబు, వరదా నరసింహమూర్తి, సిరిపురపు కృష్ణ, తెడ్లపు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల వివరాలు

- ప్రియాగార్డెన్స్‌లో రూ.30 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మాణం
- ఎన్‌జీవోస్ కాలనీలో రూ.15.50 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం
- నరసింహనగర్‌లో రూ.18.80 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం
- కాపువీధిలో రూ.12.85 లక్షలతో సీసీ రోడ్లు
- పాత గోశాల పునరావాసుల కాలనీలో రూ.19.96 లక్షలతో సీసీ రోడ్లు, కల్వర్టులు
- పాత గోశాల పునరావాసుల కాలనీలో రూ.18.12లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

శాకంబరిగా రాజశ్యామల



శాకంబరీ అలంకరణలో రాజశ్యామల అమ్మవారు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో నిర్వహిస్తున్న శ్యామా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 3వ రోజు సోమవారం రాజశ్యామల అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రకృతి సిద్ధంగా లభించే అన్ని రకాల పోషక పదార్థాలతో కూడిన కాయగూరలతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శాకంబరి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకోవడం ద్వారా ఆయా దినుసులలో ఉండే శక్తి,సంపూర్ణ పోషణ మనకు చేకూరి ఆరోగ్యవంతంగా ఉంచుతుందని భక్తుల విశ్వాసం.కాలగమణంలో రుతుమార్పుల ద్వారా ఉత్పన్నమయ్యే అనేక రకాల మధుర ఫలాల అలంకరణ వీక్షణం వల్ల భక్తులు తమ తమ జీవితాలను షడ్రోసోపేతంగా సాగించే కటాక్షాన్ని అమ్మవారు కలిగిస్తుందని ప్రతీతి. సాయంత్రం అమ్మవారి సన్నిధిలో రాజశ్యామల హోమం నిర్వహించారు.

అక్రమ గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోవాలి

పరవాడ: ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్ సమీపంలో సర్వే నంబరు 11లో అక్రమ గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోవాలని.. ఇప్పటికే తవ్వకాలు చేపట్టిన వారిని గుర్తించి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణలు డిమాండ్ చేశారు. అక్రమ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతాన్ని వారు సోమవారం సందర్శించారు. అక్రమ తవ్వకాలపై కలెక్టర్ జోక్యం చేసుకొని కారకులపై చర్యలు చేపట్టాలని కోటేశ్వరరావు, సత్యనారాయణ కోరారు.

గుణాత్మక విద్యతో సామర్థ్యం మెరుగు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో సూర్యనారాయణమూర్తి

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల స్థాయి అభ్యసన అభివృద్ధి మానిటరింగ్ టీమ్ సోమవారం పరిశీలించింది. విద్యార్థులకు మంచి గుణాత్మక విద్య అందించడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ఎంఈవో సూర్యనారాయణమూర్తి తెలిపారు.విద్యార్థుల్లో అభ్యసన స్థాయిని పరిశీలించి తగిన విద్యాబోధన అందించడం జరుగుతుందన్నారు. ఉన్నత పాఠశాలల్లోని 6,7,8 తరగతుల విద్యార్థులకు ఈ అభ్యసన తరుగుతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బోధనలో అనుసరించాల్సిన అంశాలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-1 లక్ష్మణరావు, నోడల్ ప్రధానోపాధ్యాయులు ఆర్‌వీ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కూర్మన్నపాలెం: రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి, ప్రజలను మోసం చేసిన కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1096వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ప్లాంట్‌లోని బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులతో పాటు గాజువాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు చెల్లుబోయిన నాయుడు, నాయకులు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలా నష్టాల్లోకి నెట్టిన కేంద్రప్రభుత్వం వైఖరి మార్చుకోవాలన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు తెలుపుతుందన్నారు. రానున్న కాలంలో ప్రజలను చైతన్యం చేసే విధంగా కార్మికులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మొల్లి అప్పారావు, నెల్లి అప్పలరాజు, పోలవరపు రమణబాబు, జైకుమార్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల వద్ద సౌకర్యాలు కల్పించాలి

సిబ్బందికి ఏపీ సీఈవో ముఖేష్ కుమార్ మీనా ఆదేశం



పెద్దిపాలెం పోలింగ్ బూత్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న సీఈవో ముఖేష్ కుమార్ మీనా

ఆనందపురం : రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్ట్రోల్ అధికారి ముఖేష్ కుమార్ మీనా సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పెద్దిపాలెంలో ఏర్పాటు చేసిన 86, 87 పోలింగ్ బూత్‌లను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ల వద్ద దివ్యాంగుల కోసం రెయిలింగ్, ర్యాంప్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే మంచినీరు, విద్యుత్, వెలుతురు వంటి సౌకర్యాలు తప్పకుండా కల్పించాలన్నారు. సౌకర్యాలు కొరవడిన దగ్గర మూడు రోజుల్లో నూరు శాతం సౌకర్యాలు కల్పించాలని ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్ బీఎల్‌వోల వద్ద గల రిజిస్ట్రేషన్ వివరాలు అడిగి తెలుసుకుని, ఓటరు జాబితా పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో భాస్కరరెడ్డి, తహసీల్దార్ హేమంత్ కుమార్, ఆర్ఐ మణికంఠ తదితరులు ఉన్నారు.

ఏపీఎండీసీకి ఏయూ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎండీసీ) సంస్థలో ఉద్యోగాలకు ముగ్గురు ఏయూ విద్యార్థులు ఎంపికయ్యారు. ఏయూ ఎంహెచ్ఆర్ఎం కోర్సు చదువుతున్న ఎం.రవిశ్రీ కిరణ్, ఎం.ఎ.నూకరాజు, ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంట్ సైన్స్ కోర్సు చదువుతున్న కుంచె అపూర్వ ఏపీఎండీసీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి వార్షిక వేతనంగా రూ.8.4 లక్షలు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆచార్య జాలాది రవి, ఆచార్య అరుణ్ కుమార్, ఆర్ట్స్-కామర్స్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి.మోహన్‌గణేష్, తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు 700 మందికిపైగా విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో ఎంపికయ్యారని ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.ఆర్.రెడ్డి తెలిపారు.

సైకాలజీ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగం విద్యార్థులను వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. ఇటీవల జరిగిన 28వ అంతర్జాతీయ, 59వ జాతీయ ఇండియన్ అకాడమీ ఆఫ్ అప్లయిడ్ సైకాలజీ సదస్సుల్లో పాల్గొని, పలు అవార్డులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఇటువంటి సదస్సుల్లో పాల్గొనడం వల్ల నూతన జ్ఞానాన్ని నిపుణుల నుంచి పొందడం సాధ్యపడుతుందన్నారు. శాస్త్ర సంబంధంగా జరుగుతున్న పరిశోధనలు, ఆవిష్కరణలను తెలుసుకోవడానికి ఇటువంటి సదస్సులు ఉపకరిస్తాయని చెప్పారు.

హిట్ అండ్ రన్ సెక్షన్లు రద్దు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ అసోసియేషన్ నాయకులు

సింహాచలం: ప్రభుత్వం జారీ చేసి సెక్షన్ 106(1),(2) హిట్ అండ్ రన్‌ను ఉపసంహరించుకోవాలని కోరుతూ సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం ఎస్‌డబ్ల్యూఎఫ్ అసోసియేషన్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. డ్రైవర్ల సంతకాల సేకరణ చేశారు. వెంటనే సంబంధిత సెక్షన్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.మోటారు కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సింహాచలం డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.జె.పి.రావు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలకు చేరాలి



పాత్‌వే ప్రారంభిస్తున్న సీజీఎస్‌టీ కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సంజయ్‌పంత్

కొమ్మాది: ఆత్మవిశ్వాసంతో అంధ విద్యార్థినులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సీజీఎస్‌టీ కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సంజయ్‌పంత్ సూచించారు. సాగర్ నగర్ సమీపంలో గల అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో పాత్‌వే (నడక మార్గం)ను సోమవారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సీజీఎస్‌టీ డిపార్టుమెంట్ రూ.3.50 లక్షలతో పాఠశాలలో పాత్‌వేను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ తిరుమల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య విభాగంలో పని చేస్తున్న డాక్టర్ డి.మురళీకృష్ణ బీకాం, ఎంకాంలో వివిధ సబ్జెక్టులకు సంబంధించి పది పుస్తకాలను రచించడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. ఈ పుస్తకాలలో రెండింటిని సోమవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయుక్తంగా ఈ పుస్తకాలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, రవికుమార్, శ్రావణ్‌కుమార్, ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న డీఐజీ విశాల్ గున్ని



డీఐజీ విశాల్ గున్నికి అప్పన్న చిత్రపటాన్ని అందజేస్తున్న ఏఈవో భ్రమరాంబ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అర్చకులు అష్టోత్తరం పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు.

స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని ఏఈవో భ్రమరాంబ ఆయనకు అందజేశారు. గోపాలపట్నం సీఐ సురేష్, ఎస్ఐ రామకృష్ణ ఆయన వెంట ఉన్నారు. దేవస్థానం సూపరింటెండెంట్ కనకరాజు, పీఆర్వో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సమస్యలు పరిష్కరించాలని గిరిజనుల వినతి



ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావుకు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

మహారాణిపేట: చినగదిలి మండలం సింహాచలం కొండపై నివసిస్తున్న గిరిజనులు, ప్రజా సంఘాల నాయకులు సోమవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావును కలిశారు. విజయనగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో చైర్మన్‌ను కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ఆయన ఈ సమస్యల ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే..

సీఐ బాలసూర్యారావు



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ బాలసూర్యారావు

పరవాడ: మారుతున్న కాలానికి అనుగుణంగా ట్రాఫిక్ నిబంధనలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సీఐ ఎస్.బాలసూర్యారావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో సోమవారం సైబర్ క్రైం, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ బాలసూర్యారావు మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రతీ వాహనానికి ఇన్సూరెన్స్, రికార్డులు కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సీఐ బాలసూర్యారావు సూచించారు. విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలైన పదో తరగతి విద్యార్థులు బి.కార్తీక్, బి.కుష్వంత్‌లకు రూ.500 చొప్పున నగదు బహుమతులు సీఐ బాలసూర్యారావు అందజేశారు. సదస్సులో ఎస్ఐ మల్లేశ్వరరావు, హెచ్ఎం బి.అప్పలనాయుడు, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా రవాణాతో పర్యావరణ పరిరక్షణ



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ వస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేర్కొన్నారు. ఆమె తమ క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం తన చాంబర్‌లో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్)కు హాజరయ్యారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై వచ్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో నగరంలో పర్యావరణ పరిరక్షణకు జీవీఎంసీ అనేక చర్యలు చేపడుతుందన్నారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.